# పార్వతి గుణపాఠం

## యర్రంశెట్టి శాయి



ఓ రోజు పొద్దున్నే పార్వతీ పరమేశ్వరులు ఓ చిన్న మేఘం ఎక్కి మార్నింగ్ వాక్ కి బయల్దేరారు. భూభాగమంతా తిరిగి భారతదేశం దాటుతోంటే పార్వతి కిందకు చూసి అక్కడ కనిపించిన అందమైన దృశ్యాలకు ముచ్చట పడిపోయింది.

"నాథా! భూమ్మీద ఇంత అందమయిన ప్రదేశముందని ఎప్పుడూ చెప్పారు కారేం? అబ్బ! ఆ చక్కని సరోవరాలూ, అందమైన ఆ వాహనాలు, భవనాలు, రోడ్లూ—కాసేపు అక్కడ తిరిగివద్దాం, రాకూడదా?" అంటూ గోముగా అడిగింది శివుడిని.

శివుడు ఓ క్షణం ఆలోచించాడు.

"కాని పార్వతీ! దూరపు కొండలు నునుపని ఓ పుస్తకంలో ఓ కవితో నేనే రాయించాను" నసిగాడు శివుడు.

పార్వతి బుంగమూతి పెట్టేసింది.

"అవున్లెండి, మీరెప్పుడూ ఇంతే. అడగ్గానే ఎప్పుడు నా ముద్దు చెల్లించారనీ...." అని వెనక్కి తిరిగి రంయ్యిన వెళ్లిపోబోయింది.

శివుడు ఖంగారుపడి ఆమె చేయి పట్టుకుని ఆపేశాడు.

"సరే—పద పార్వతీ! నువ్వంతగా మనసు పడుతుంటే కాదని ఎలా అంటాను. అయితే ఓ విషయం గుర్తుంచుకో! మనం ఇప్పుడు భూలోకం చేరామంటే చీకటిపడే వరకూ మళ్లీ వెనక్కి రాలేం? అంతవరకూ మన మహిమలేం పనిచేయవు. మానవ రూపంతో అలా ఉండిపోవాల్సిందే!"

"పరేం ఫరవాలేదు నాథా! ఎప్పుడూ ఈ మబ్బుల్లో తిరిగి తిరిగి విసుగుపుడుతోంది, పదండి వెళ్దాం...." అందామె.

మరుక్షణంలో ఇద్దరూ మానవరూపం ధరించి భూలోకంలోకి దిగిపోయారు.

శివుడు వెంటనే తన మాయాజాలంతో నోట్లతో నిండిపోయిన మనీపర్సుని సృష్టించి జేబులో పెట్టుకొన్నాడు.

"అదేమిటి నాథా?" అడిగింది ఆశ్చర్యంగా.

"డబ్బు! ఇక్కడ డబ్బులేనివాడిని కుక్కలుకూడా లెక్కచేయవు...." అన్నాడు శివుడు నవ్వుతూ. ఇద్దరూ కొంచెం రద్దీగా ఉన్న ఆ రోడ్డుమీద పక్కపక్కనే నడుస్తూ సాగారు.

"నాథా! అదుగో సరోవరం! నేను చెప్పలేదూ! ఎంత బావుందో చూడండి!" అంది పార్వతి ఎదురుగ్గా కనబడుతున్న పెద్ద కొలను

చూపుతూ.

శివుడు ఆశ్చర్యపోయాడు.

"నువ్ చెప్పింది నిజమే పార్వతీ! కాని మనుషులూ, వాహనాలూ, ఆ సరోవరంలో నుంచే అటూ ఇటూ తిరుగుతున్నాయేమిటి?" అన్నాడు ఆలోచిస్తూ.

ఇద్దరూ ఆ సరోవరం దగ్గరగా వచ్చారు.

ఒక్కసారిగా గుప్పున ముక్కులు పగిలే దుర్వాసన కొట్టింది.

"అబ్బ!" అంది పార్వతి ముక్కుమూసుకొని వాంతయేట్లు మొఖం పెట్టి. శివుడు కూడా ముక్కు మూసుకొని పక్కనే నడుస్తున్న ఓ విద్యార్థిని "ఏమిటింత దుర్వాసన వస్తోందిక్కడ?" అనడిగాడు.

ఆ విద్యార్థి ఓసారి వారిద్దరినీ ఎగాదిగా చూచి "పెద్ద దేవలోకంనుంచి దిగివచ్చినట్లు పోజుపెడుతున్నారే! ఆ డ్రైనేజి పైప్ పగిలి ఆ నీరు ఇలా లీకవుతూ వుంటుంది. నా చిన్నప్పటినుంచీ ఇదింతే! మరి ఆ నీరు దుర్వాసనకొట్టక పన్నీటివాసన కొడుతుందా?" అనేసి తన దారిన తను ఆ నీళ్లల్లో ఈదుకొంటూ వెళ్లిపోయాడు.

"చూశావా పార్వతీ! అది సరోవరం కాదట! డ్రైనేజీ పైపులు పగిలి చేరుకొన్న నీరట!" అన్నాడు శివుడు ఆశ్చర్యంగా.

"మరిప్పుడీ పాడు నీళ్లల్లోనే దిగి నడవాలా మనం?" ఏడుపు మొహంతో అడిగింది పార్వతి.

శివుడు ఓ ఉపాయం ఆలోచించాడు.

"పోనీ, ఓ పనిచేద్దాం! టాక్సీలో ఈ సరోవరాన్ని దాటేద్దాం!" అన్నాడు టాక్సీ కోసం వెతుకుతూ.

అరగంట నిలబడ్డాక ఖాళీ టాక్సీ దొరికింది.

"ఎక్కడికెళ్ళాలి?" అడిగాడు టాక్సీవాడు శివుడిని.

"ఎక్కడికా! ఎక్కడికంటే... ఎక్కడికి పార్వతీ?" పార్వతి నడిగాడు.

"అదే! మనం ఇందాక బస్‌మీద చూశ్లేదూ? అదేమిటి కోటీ—కోటీకెళ్లాలని చెప్పండి!"

"కోటీకెళ్ళాలోయ్...." అన్నాడు శివుడు.

"మీటరుమీద అయిదురుపాయలివ్వాలి" అన్నాడు టాక్సీవాడు.

"ఎందుకూ?"

"పిచ్చిప్రశ్న లేయకు! ఎందుకేమిటి? అందు కిష్టమయితే రా, లేకపోతే పో!" టాక్సీ స్టార్టుచేసి వెళ్లిపోబోయాడు వాడు.

శివుడు గాభరాగా వెంబడిపడ్డాడు.

"సరే-అలాగే తీసుకొందువుగాన్లే! ఆపు" అన్నాడు బ్రతిమాలుతూ.

టాక్సీవాడు ఆపి వెనుకడోర్ తెరిచాడు. శివుడూ పార్వతి లోపల కూర్చున్నారు.... టాక్సీ బయల్దేరింది.

"ఇదే ఊరు? ఏ ప్రాంతం?" అడిగాడు శివుడు టాక్సీ డ్రైవరుని.

"ఇదా? హైద్రాబాద్! ఆంధ్రప్రదేశ్ రాజధాని!" జవాబిచ్చాడు టాక్సీవాడు.

టాక్సీ కోఠీలో ఆగింది.

మీటరుచూసి రెండు పది నోట్లు తీసి ఇచ్చాడు శివుడు.

"మీ ఊళ్లో టాక్సీ లుండవా?" అడిగాడు టాక్సీడ్రైవరు.

"ఉంటాయి! కాని వాటికి మీటర్లుండవు..."

టాక్సీ వెళ్లిపోయింది. బాగా రద్దీగా వుంది రోడ్డు.

"అబ్బ! ఎంత బావుందో ఈ సెంటరు" ఆనందంగా అంది పార్వతి చుట్టూ వున్న షాపులవంక చూస్తూ. ఇద్దరూ కొద్దిదూరం నడిచారు.

"నాకు కాఫీ తాగాలని వుంది నాథా!" అంది పార్వతి.

ముందు నడుస్తోన్న ఓ యువకుడి భుజం మీద తట్టి "ఇక్కడ కాఫీహోటల్ ఎక్కడుందో తెలుసా బాబూ?" అనడిగాడు శివుడు.

"ఏమిటీ అన్నావ్? బాబూ అనా? అంటే నేను మగరాయుడిలా కనబడుతున్నానా నీ కళ్లకి లేకపోతే తెలీనట్లు నటించి నా భుజం మీద చేయివేద్దామనా?" కోపంగా అడిగిందా యువతి చొక్కా చేతులు పైకి మడుస్తూ.

శివుడు భయపడిపోయాడు. "పొరబాటయింది. మీరు ఆడపిల్ల అనుకోలేదు" అన్నాడు నొచ్చుకుంటూ.

"అలా దారికి రా! అదిగో! అదే కాఫీ హోటలు...." అందా అమ్మాయ్.

శివుడూ, పార్వతీ ఆ హోటల్లోకి నడిచారు

"ఫలహారా లేవున్నయ్?" సర్వర్ నడిగాడు శివుడు.

"ఇడ్లీ, వడా, దోసె, ఊతప్పా, పూరీ."

"దోసె ఎంత?" అడిగాడు శివుడు.

"రెండ్రూపాయలు...."

గుప్పున కేకవేశాడు శివుడు.

"ఏమిటీ? దోసె రెండ్రూపాయలా?"

"ఇష్టమయితే తిను, లేకపోతే బయటకు పో! ఆ కేకలేమిటి అసహ్యంగా?" కోప్పడ్డాడు సర్వరు.

"అదికాదు మరీ రెండ్రూపాయలనేసరికి భయంవేసింది. అయినా ఇలా ఇష్టమొచ్చినట్లు హోటల్‌వాళ్లు ధరలు పెంచేస్తే అడిగేవారెవరూ లేరా ఇక్కడ?"

సర్వర్ ఘొల్లున నవ్వాడు.

"పిచ్చి నాయనా! ఇది అంధేరాప్రదేశ్! ఇక్కడ హోటల్‌వాళ్ళ జోలికొచ్చేవారెవరూ లేరు. ఇదే మద్రాస్‌గానీ, బొంబాయిగానీ అయితే హోటల్‌వాళ్ళమీద చాలా కంట్రోల్ ఉన్నాయిగానీ దేముడి దయవల్ల మాకలాంటి యిబ్బందులేమీ లేవు. మా ఇష్టం! మా రాజ్యం! రేపొద్దున్న దోసె అయిదు రూపాయలన్నా సరే అందరూ నోర్మూసుకొని తినాల్సిందే.... సరేగానీ నీకేం ఇమ్మంటావ్ ఇప్పుడు? బైటూ కాఫీ ఇవ్వనా?"

సరేనని తలూపాడు శివుడు. బయట వర్షం కురిసి వెలిసిపోయింది.

రెండు నిమిషాల్లో రెండు కప్పుల్లో నాలుగు కాఫీ తెచ్చి ఇచ్చాడు సర్వరు.

తాగి బిల్లు చెల్లించి బయటికొచ్చారిద్దరూ. రోడ్లమీద గుంటలన్నీ వర్షంనీటితో నిండి వున్నయ్.

"అబ్బ-ఎంత బావుందో ఆ నీళ్ళగుంటలు" నీళ్ళగుంటల్లోనుంచి నడుస్తూ అంది పార్వతి.

అంటూనే 'అమ్మో' అని కేకవేసి నీళ్ళ గుంటలో మెడలోతుకి దిగిపోయింది. మరుక్షణం జనమంతా పోగయి ఆమెని బయటకు లాగారు.

"ఇదేమిటి రోడ్డు మీద ఇంతలోతు గుంటలా?" చీర పిండుకొంటూ ఉక్రోషంగా అందామె.

"ఇది మునిసిపల్ కార్పొరేషన్ వాళ్లు పైపులకోసం తవ్విన గొయ్యి! కొంచెం అవతల నీళ్ళగుంట వుంది చూశారూ అది ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వాళ్లది. ఈ రెంటికీ మధ్య వున్నది డ్రైనేజీ స్కీమ్ వాళ్లది. ఇలా ఎవరి గొయ్యి వాళ్లు తవ్వుతూనే ఉంటారిక్కడ. అయితే తమాషా ఏమిటంటే యెవడు తీసిన గోతిలో వాడుమాత్రం పడడు. ఎవరో గొయ్యి తీసిన పడేదిమాత్రం యెప్పుడూ మనమే..." అన్నాడో తల మాసిపోయిన వ్యక్తి. అతను నాలుగడుగులువేసి అతనో గోతిలో పడిపోయేడు. అందరూ అతనిని అతి కష్టంమీద

బయటకు లాగేరు.

"చూశారా! ఇది కొత్తగొయ్యి! నిన్నటి వరకూ లేదిది. రాత్రి మరేదో కొత్త డిపార్ట్‌మెంట్ వాళ్లు తవ్వినట్లున్నారు. అందుకని కొత్తచేసింది నాకు...." అన్నాడా వ్యక్తి చలికి వణికిపోతూ.

పార్వతి మొఖం మాడిపోయింది.

"త్వరగా బస్‌లో ఇంటికెళ్లండి! తడిసిపోయారు...." అన్నాడు శివుడు జాలిగా.

"బస్‌లోనా? నాలుగు రోజుల్నించీ ఆ ప్రయత్నంలోనే వున్నాను. ఇంతవరకూ ఒక్క బస్సూ ఈ స్టాప్‌లో ఆగితేనా?" అని గొణుక్కుంటూ వెళ్లిపోయాడతను నడుచుకొంటూ.

"ఇక్కడ పైనుంచి కనిపించినంత అందంగా లేదు నాధా!" అంది పార్వతి.

శివుడు నవ్వాడు.

ఇద్దరూ మరో నాలుగడుగులు వేశారు. హఠాత్తుగా ఓ లారీ యెదురుగ్గా అమితమైన వేగంతో వచ్చి ముందున్న సైకిల్ రిక్షానీ, ఓ స్కూటర్నీ, డాషిచ్చి వాళ్లమీదనుంచే ఆగకుండా వెళ్లిపోయింది. ఆ రిక్షా వచ్చి పార్వతి మీద పడింది.

"అమ్మో!" అంటూ అక్కడే కూలబడిపోయింది పార్వతి. బోలెడుమంది జనం ఆమె చుట్టూ మూగిపోయారు.

"అదృష్టవంతురాలు! నడుము ఒక్కటే విరిగింది! అసలు ప్రాణాలు పోవాల్సింది!" అంటున్నారెవరో.

"అదేమిటి? ఆ లారీవాడు అంత అజాగ్రత్తగా తోలడమేకాకుండా, ప్రమాదం జరిగినా పారిపోతాడేం? పోలీసులు వెంటపడరూ?" అడిగాడు శివుడు పార్వతిని లేవదీస్తూ.

అందరూ ఘొల్లున నవ్వారు. 'ఈ వూళ్లో లారీల వాళ్లకీ, ఆటోల వాళ్లకీ పూర్తి స్వాతంత్ర్యం వుంది. 1947, ఆగస్టు 15న వచ్చిందట వాళ్లకది!'

"అవన్నీ నీకెందుగ్గానీ ముందు నీ భార్యను హాస్పిటల్‌కు తీసుకెళ్లు. ఒకవేళ ఆ కాలి కేమయినా ఫ్రాక్చరయిందేమో!" ఇంకొకరు అన్నారు. వెంటనే ఆమెని రిక్షాలో వేసుకొని హాస్పిటల్ చేరుకున్నాడు శివుడు. తీరా రిక్షావాడికి డబ్బివ్వబోతే పర్సు కనిపించలేదు. అసలు జేబే లేదక్కడ. "అయ్యో! నా పర్సు కొట్టేశారు...." అన్నాడతను ఆందోళనగా.

"పోనీలే! నా డబ్బివ్వకపోతే పోనీగాని ముందా అమ్మను డాక్టరుకి చూపించు" జాలిపడి అన్నాడు రిక్షావాడు.

శివుడు పార్వతిని మోసుకొని డ్యూటీ డాక్టర్ దగ్గర కెళ్లాడు.

ఆమెను పరీక్షించి "ఎడ్మిట్ చేయాలి. కానీ ప్రస్తుతం బెడ్స్ ఖాళీలేవు...."అన్నాడు డాక్టరు.

"మరేం చేద్దాం?" ఆందోళనగా అడిగాడు శివుడు.

"చేసేదేముంది కథకంచికీ—మీరింటికీ" నవ్వుతూ అన్నాడతను.

శివుడు దిగాలుపడిపోయాడు. డాక్టర్ అతన్ని చూసి జాలిపడ్డాడు.

"పోనీలేగదాని నీకు ఉపాయం చెప్తున్నాను. నీ భార్యను ఎడ్మిట్ చేయాలనిఉంటే పాతిక రూపాయలివ్వు! ఎలాగోలా బెడ్ ఖాళీ చేయిస్తాను...."

శివుడికి దుఃఖం పొంగుకొచ్చింది "డాక్టరుగారూ! నన్ను నమ్మండి! నా దగ్గరున్న డబ్బంతా యెవరో కొట్టేశారిందాక ...." అన్నాడు దీనంగా.

"ఇరవై నాలుగో కేసు" అన్నాడు డాక్టరు సీరియస్‌గా.

"ఏమిటది? ఇలా బెడ్ లేకపోవడమా?"

"కాదు! ఇలా జేబుకొట్టేశారని అబద్ధాలు చెప్పే కేసులు...."

ఈలోగా పార్వతి కొంచెం కోలుకొంది.

"వద్దులే నాధా! ఈ హాస్పిటల్లో వాళ్లు యెదురుడబ్బిచ్చినా నేనుండను...." అంది కిటికీలోనుంచి వార్డులోకి చూస్తూ.

ఇద్దరూ బయటికొచ్చారు. శివుడిని ఆసరాగా తీసుకొని నెమ్మదిగా రోడ్డుమీద నడవసాగిందామె.

హఠాత్తుగా నలుగురు వ్యక్తులు వచ్చి వాళ్లముందు నిలబడ్డారు.

"భలే అందంగా వుంది ఫిగరు!" అన్నాడొకడు పార్వతిని చూస్తూ.

"లాక్కెళ్దామా?" అన్నాడు ఇంకొకడు.

మరొకడొచ్చి ఆమె చేయి పట్టుకొన్నాడు.

"ఏయ్ వదులు...." కోపంగా అంది పార్వతి.

శివుడు అతనిని లాగి కొట్టబోయాడు. మిగతా ముగ్గురూ అతని చేతులు విరిచి పట్టుకొని వెనక్కు తోశారు. వెల్లకిలా పడిపోయాడు శివుడు.

రోడ్డునపోయే కొంతమంది మూగిపోయారక్కడ.


"చూడండి! వీళ్లెవరో నా భార్యమీద అత్యాచారం చేస్తున్నారు" అన్నాడు శివుడు వాళ్లని ప్రాధేయపడుతూ.

వాళ్లు నవ్వారు.


"పిచ్చివాడా! మాకు చెప్తే మేమేం చేయగలం? ఆ నలుగురూ ఈ ప్రాంతానికి గూండాలు! వాళ్లకెదుర్లేదు. పోలీసులు కూడా భయపడాల్సిందే వాళ్లకు.

కొద్దిరోజుల క్రితం యింకో ప్రాంతంలో గూండాలు ఓ కాబరే ఆర్టిస్టుని నడిరోడ్డు మీద నుంచి యెత్తుకుపోయి రేప్ చేశారన్న వార్తను

టపాకాయ పేలనందువల్ల ....



....ప్రమాదం ప్రక్క పేజీలో




నువ్ పేపర్లో చదవలేదూ?'' అడిగారు వాళ్లు.

శివుడు తెల్లమొఖం వేశాడు.

ఈలోగా ఆ గుంపుని చూసి పోలీస్‌వ్యాన్ వచ్చిందక్కడికి. అది చూసి గూండాలు నెమ్మదిగా జారుకొన్నారక్కడి నుంచి. శివుడికి పోలీస్‌వ్యాన్ చూసేసరికి యెక్కడలేని ధైర్యం వచ్చింది.

"అదిగో! వాళ్లే నా భార్యమీద అత్యాచారం చేయబోయింది....'' వెళ్లిపోతున్న గూండాలవంక చూపుతూ ఇన్‌స్పెక్టర్‌తో అన్నాడు శివుడు.

వాళ్లని ఓసారి చూసి నవ్వాడు సబిన్‌స్పెక్టర్.

"మీరిద్దరూ వాన్ యెక్కండి!'' అన్నాడు శివుడితో.

"మేమెందుకు?'' అడిగాడు శివుడు ఆశ్చర్యంగా.

"మీతో కాకపోతే ఆ గూండాలతో మాకెందుకూ? వాళ్లను పట్టుకోబోతే వాళ్ళెలాగూ యెదుర్తిరుగుతారు. ఎదుర్తిరిగినవాడిని నాలుగు తన్నకుండా మేము ఊరుకోలేము కదా! తన్నిన ఆర్నెల్ల తరువాత వాడు ఏదో జబ్బుతో చచ్చినా పోలీసులు తన్నటంవల్లే చచ్చాడంటారు. దాంతో మామీద కమీషన్‌లూ రిపోర్టులూ-ప్రజలు రాళ్లు రువ్వటం-యెందుకొచ్చింది-ముందు వానెక్కండి! స్టేషన్‌కొచ్చి రిపోర్టిద్దురుగాని....''

చేసేదిలేక వాన్ యెక్కారు పార్వతీ పరమేశ్వరులిద్దరూ.

రెండు నిమిషాల్లో వాన్ పోలీస్‌స్టేషన్ ముందాగింది.

"దిగండి'' అన్నారు వాళ్లు.

పార్వతీ శివుడూ దిగి నుంచున్నారు.

'నాథా! ఇక మనం వెళ్లిపోదాం! యీ పాడు భూలోకం నాకు నచ్చలేదు'' అంది పార్వతి.

శివుడు తల ఊపాడు.

'మన మహిమలు మనకు రావడానికి యింకా టైముంది పార్వతీ! ఇంకొద్ది నిమషాలు ఆగితేగాని పొద్దుగూకదు'' అన్నాడు నిరుత్సాహంగా.

'లోపలకు రండి!'' అన్నాడు ఓ కానిస్టేబుల్.

ఇద్దరూ లోపలకు నడిచారు.

'ఏ వూరు మీది?'' అడిగాడు ఇనస్పెక్టరు.

'ఇక్కడికి చాలా దూరం!''

'ఏం పనిమీద వచ్చారిక్కడికి?''

'మా ఆవిడ వూరు చూద్దామని ముచ్చటపడితే....''

'నువ్వలా బయట కూర్చో కాసేపు. నీ భార్యను ప్రశ్నించాలి....''

శివుడు బయటకు నడిచి బల్లమీద కూర్చున్నాడు.

మరుక్షణంలో పార్వతి కేకలు విన్పించాయి.

శివుడు అదిరిపోయి లోపలకు పరుగెత్తాడు. సబిన్‌స్పెక్టర్ సరసమాడబోయేడని ఇంతెత్తున యెగురుతూ తిట్టిపోస్తోంది పార్వతి.

'అన్యాయం! ఆ గూండాల బారినుండి రక్షించమని వేడుకుంటే మీరే ఇంత పని చేస్తారా?'' అరచాడు శివుడు.

'వీడిని తీసుకెళ్లి లాకప్‌లో పడేయండ్రా'' అరచాడు ఇనస్పెక్టర్.

ఇద్దరు పోలీసులు శివుడిని లాక్కెళ్లి లాకప్‌లో వేశారు.

పార్వతి బిగ్గరగా కేకలు వేస్తోంది. శివుడు తల్లడిల్లిపోతున్నాడు.

"నాథా....'' అంటూ బిగ్గరగా కేకలేస్తోందామె.

శివుడికేమి చేయడానికీ పాలుపోవడంలేదు.

హఠాత్తుగా గదిలో లైటు వెలిగింది.

శివుడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయాడు.

"పార్వతీ! పొద్దుగూకిపోయింది! పద! ఇంక వెళ్లిపోదాం!'' అన్నాడు గట్టిగా.

మరుక్షణంలో ఇద్దరూ ఆకాశమార్గంలో పయనిస్తున్నారు.

"అరె! మనం పట్టుకొనే వున్నాం కదా! ఆ పిట్ట యెలా మాయమయింది?'' ఆశ్చర్యంగా అన్నాడు సబిన్‌స్పెక్టర్.

"అదేసార్ మాకూ అర్థం కావడంలేదు'' అన్నారు కానిస్టేబుల్స్.

మబ్బులో శివుడిమీద వాలిపోయినా పార్వతి యింకా వణుకుతూనే వుంది.

"నాథా! నన్ను మన్నించు! దూరపు కొండలు నునుపని మీరు చెబుతున్నా వినకుండా హైద్రాబాద్ చూద్దామని కిందకు లాక్కెళ్లాను మిమ్మల్ని. సమయానికి మీరు రక్షించి ఉండకపోతే నా బ్రతుకేమయేది? ఇంకెప్పుడూ భూలోకంవేపే చూడను!'' అంది భయంగా.

ఆమె శిరస్సుమీద ఆప్యాయంగా నిమురుతూ శివుడు నవ్వుకున్నాడు.

"పొద్దుగూకేవరకూ మన మహిమలు పని చేయవని పార్వతికి తను అబద్ధం చెప్పబట్టే ఇప్పుడు పార్వతి చక్కని గుణపాఠం నేర్చుకొంది. లేకపోతే ఆ భూలోకాన్ని శపించేసి సృష్టిని తారుమారు చేసిపారేసేది'' అనుకొన్నాడతను గుంభనంగా.

